మైనారిటీ బాలికల గురుకులంలో ప్రవేశాలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. అర్హులైన విద్యార్థినులు tmreis.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7331170821లో సంప్రదించాలని పేర్కొన్నారు. పాఠశాలలో ఖురాన్ పూర్తి చేసుకున్న ముస్లిం విద్యార్థినులను ఘనంగా సన్మానించారు.

ఘనంగా రమాబాయి జయంతి

నిజాంపేట, ఫిబ్రవరి 7: నస్కల్‌లోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కాలనీవాసులు శివ ప్రసాద్, కవిత, సిరి, అనుషవ్వ, యాదమ్మ, వాణి, ఎల్లవ్వ పాల్గొన్నారు.

వివాహితకు ఆర్థిక సాయం

రామాయంపేట, ఫిబ్రవరి 7: రూన్సీలింగాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కల్వల లచ్చయ్య కుమార్తె వివాహానికి మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

50శాతం అపార్ సర్వే పూర్తి

రామాయంపేట, ఫిబ్రవరి 7: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల అపార్ సర్వే 50 శాతం పూర్తయ్యిందని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 54 ప్రభుత్వ, 5 ప్రైవేటు పాఠశాలల్లో 8530 విద్యార్థులు ఉన్నారని, అందులో 50 శాతం అపార్ సర్వే పూర్తి చేశామని పేర్కొన్నారు.

గరుడ పక్షికి చికిత్స

రామాయంపేట, ఫిబ్రవరి 7: సుతారిపల్లి అటవీ ప్రాంతంలో గరుడ పక్షికి తీవ్ర గాయాలై పడిపోయింది. ఇది గమనించిన రైతు కాట్రియాల రమేశ్ శుక్రవారం రామాయంపేటలోని పశు వైద్యశాలకు తీసుకెళ్లాడు. వైద్యుడు భూమేశ్ చికిత్స చేయించాడు. అనంతరం రైతు తన పొలం వద్ద గరుడ పక్షిని విడిచిపెట్టాడు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌లు పంపిణీ

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7: సంఘ సేవకుడు నాచం వర్ధయ్య వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పెద్దబజార్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు నాచం రమేశ్, హెచ్ఎం రమేశ్‌తో కలిసి స్టీల్ ప్లేట్లు, గ్లాస్‌లు, వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7: నేడు మెదక్‌లో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి కాలం దృష్ట్యా విద్యుత్తు సరఫరాలో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7: సూరారం లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. డీఈవోగా ప్రణవి, జిల్లా పాలనాధికారిగా భవిత, ఎంఈవోగా శైలజ వ్యవహరించారు. హెచ్ఎం సాయి రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు మనీష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శిల్పా, విజయశ్రీ పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షం లభించదా?

- అసంపూర్తి రోడ్డులో అవస్థల ప్రయాణం
- జిల్లా కేంద్రం మెదక్‌కు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలే..
- కంకర దారిలో ప్రయాణికుల కష్టాలు

జిల్లా కేంద్రం మెదక్ వెళ్లే రహదారిలో కంకర తేలి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7: దశాబ్దాల క్రితం మంజూరైన రోడ్డుకు ఇంకా మోక్షం లభించడం లేదు. జిల్లా కేంద్రమైన మెదక్‌కు వెళ్లే రహదారిని అసంపూర్తిగా వదిలేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో కొనసాగుతున్న ఈ పనులు ప్రారంభించి పదేండ్లు పూర్తయినా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలంతో పాటు రేగోడ్ నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు మెదక్ వెళ్లాలంటే ఆ రోడ్డు మీదుగానే ప్రయాణించాలి. ఈ దారి పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు బొడ్మట్‌పల్లి మీదుగా 18 కిలోమీటర్లు ఎక్కువ ప్రయాణం చేయాల్సి వస్తున్నది.

పదేండ్లయినా అసంపూర్తిగానే పనులు

దశాబ్దం క్రితం మంజూరైన రోడ్డుకు ఇంకా మోక్షం కలుగడం లేదు. పెద్దశంకరంపేట నుంచి పాపన్నపేట మండలం నార్సింగ్ వరకు 18 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇందులో 10 కిలోమీటర్ల వరకు నిధులు మంజూరుచేశారు. ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పి, ఇప్పటికీ రోడ్డు అలాగే ఉంది. నారాయణఖేడ్ ఉప ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చి ప్రత్యేక నిధులు కూడా మంజూరు చేశారు. అయితే కాంట్రాక్టరు ఇష్టారీతిలో పనులు చేయడంతో రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోయింది. ఇందులో భాగంగా పెద్దశంకరంపేట నుంచి 400 మీటర్ల సీసీ రోడ్డు, మాడ్చెట్‌పల్లి గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్లు టేక్మాల్ మండలం బోడగట్టు నుంచి ఎల్లూపేట వరకు 4 కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులకు అప్పట్లో మంత్రి హరీశ్‌రావు చొరవతో రూ.9 కోట్లు మంజూరు చేశారు. అంతలోనే ఎన్నికలు రావడంతో ఈ పనులు ఆగిపోయాయి.

అసంపూర్తిగా కల్వర్టు పనులు

శివాయపల్లి, మాడ్చట్‌పల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న రోడ్డు కల్వర్టు పనులు పూర్తి చేయలేదు. రెండువైపులా మట్టి రోడ్డు వేసినప్పటికీ కల్వర్ట్ లింక్ చేయడంలో విఫలమయ్యారు. ఇటీవల అందోల్ నియోజకవర్గంలో కొన్ని రోడ్లకు నిధులు విడుదల చేశారు. ఈ జాబితాలో ఈ రోడ్డు ఉంటుందని ఇక్కడి గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూశారు. వారి ఆశలు గల్లంతయ్యాయి. మంత్రి దామోదర రాజనర్సింహ హయాంలోనైనా ఈ రోడ్డుకు మోక్షం కలగాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి

మెదక్‌కు వెళ్లే రహదారిని పూర్తి చేయాలి. పెద్దశంకరంపేటకు సుమారు 10 గ్రామాల ప్రజలు రోజూ వస్తుంటారు. ఈ రహదారి దశాబ్దంగా అసంపూర్తిగా ఉంది. దీన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. బైక్‌పై రాత్రి సమయంలో వెళ్తుండగా కంకర తేలిన రహదారిపై అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలి.

- కొత్త శ్రీనివాస్, వ్యాపారి, పెద్దశంకరంపేట

బర్డ్‌ఫ్లూపై పౌల్ట్రీ రైతులకు అవగాహన

రామాయంపేటలో పౌల్ట్రీ రైతులు, పశువైద్యాధికారులతో మావేశంలో డాక్టర్ తిరుపతి

రామాయంపేట, ఫిబ్రవరి 7: బర్డ్‌ఫ్లూపై పౌల్ట్రీ రైతులు జాగ్రత్తలు వహించాలని మండల పశువైద్యశాల మానిటరింగ్ అధికారి డాక్టర్ తిరుపతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పశువైద్య కేంద్రంలో నార్సింగి, నిజాంపేట, రామాయంపేట మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, పౌల్ట్రీ రైతులతో సమావేశం నిర్వహించారు. రోజురోజుకు పౌల్ట్రీల్లో బర్ఫ్లూ వస్తున్నదన్నారు. అలాంటి వైరస్ ఏమైనా కోళ్లకు కనిపిస్తే వెంటనే సమాచారం తెలుపాలన్నారు. మూడు మండలాల్లో తమ సిబ్బంది పౌల్ట్రీ ఫామ్‌లను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కోళ్ల ఫాంలోకి రైతులు వెళ్లేప్పుడు చేతులకు గ్లౌజులు, కాళ్లకు షూస్, ముఖానికి మాస్కులను ధరించాలన్నారు. కోళ్లు ఆకస్మికంగా మరణిస్తే వాటిని బయట ప్రాంతాల్లో పడేయవద్దన్నారు. చనిపోయిన కోళ్లను 5 నుంచి 6 ఫీట్ల వరకు గుంతలు తీసి పాతిపెట్టాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌల్ట్రీ రైతులు, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట మండలాల పశువైద్యాధికారులు శ్రీనివాస్, సుధాకర్ దేశ్‌ముఖ్, మౌనిక పాల్గొన్నారు.

కృత్రిమ గర్భ ధారణతో పశు పోషణ లాభసాటి

గేదెకు కృత్రిమ గర్భధారణ చేస్తున్న డాక్టర్ వెంకటయ్య

చిలిపిచెడ్, ఫిబ్రవరి 7: మండలంలోని బండపోతుగల్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు కృత్రిమ గర్భధారణను డాక్టర్ వెంకటయ్య శుక్రవారం నిర్వహించారు. 41 పశువులకు గర్భస్థ పరీక్షలు, 19 పశువులకు సాధారణ చికిత్సలు, 24 పశువులకు కృత్రిమ గర్భధారణ, దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ డివిజనల్ ఏడీ జనార్దన్, చిలిపిచెడ్ మండల పశువైద్యాధికారి వినోద్ కుమార్, మూసాపేట్ పశువైద్యాధికారి నాగార్జున పాటిల్, వి.సురేశ్, సూపర్ వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, గోపాల మిత్ర శంకరయ్య, రైతులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



యూరియా చల్లిస్తున్న అధికారి



పురుగు మందు కలుపుతున్న రైతు

రామాయంపేట, ఫిబ్రవరి 7: రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని ఏఈ రాజ్ నారాయణ అన్నారు. శుక్రవారం రామాయంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి, వరికి మొగి పురుగు ఉన్న పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. యూరియా కలిపే ముందు మొగి పురుగు నివారణకు మందును కలిపి వరి మడిలో చల్లించారు. పంటలకు నీటి తడులు తక్కువగా ఉండాలన్నారు. నీటి తడులు ఎక్కువైనా పంటలకు కాలుష్యంతో పాటు సూక్ష్మ జీవులు, పురుగులు, వాన పాములు పంటల వేర్లలోనే ఉండడంతో భూమిలో సేంద్రియ కర్బణ పదార్థం తగ్గిపోతుంది. దీర్ఘకాలంలో నేలలు చౌడుబారి పోతాయని తెలిపారు. రైతులు ఎప్పుడైనా ఏ పంట వేసినా వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఆయన వెంట ఏఈవో సాయికృష్ణ, ప్రవీణ్, రాజు, రైతులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 26 మందికి సీఎంఆర్ఎఫ్ రూ.6.50 లక్షల చెక్కులను శుక్రవారం సత్యనారాయణ, రాజిరెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రావ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమేశ్ గౌడ్, రాజాసింగ్, జీవన్, రమేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పేద వధువుకు దాతల సాయం

చేగుంట, ఫిబ్రవరి 7: మండలంలోని ఇబ్రహీంపూర్‌కు చెందిన బెదరబోయిన ఎల్లవ్వ, బాలయ్య కూతురు వివాహానికి వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి పుస్తెమట్టెలు, పెండ్లి బట్టలు, క్వింటాల్ బియ్యాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తదితరులు శుక్రవారం అందజేశారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

నిజాంపేట, ఫిబ్రవరి 7: మండలంలోని శౌకత్‌పల్లి తండాలో బీఆర్ఎస్ నాయకుడు మడావత్ పత్తినాయక్, మంగి దంపతుల కూతురు సౌందర్య వివాహం శుక్రవారం జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వధువుతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. బచ్చురాజ్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచులు నర్సింహులు, అరుణ్‌కుమార్, ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, సుదర్శనం, బీఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, నాగరాజు, రాములు, నరేందర్‌నాయక్, రాజునాయక్, లక్ష్మణ్, వెంకటస్వామిగౌడ్, గౌస్, రవీందర్, మావురం రాజు, చంద్రం, భాస్కర్‌నాయక్ ఉన్నారు.

మెనూ పకడ్బందీగా అమలు చేస్తున్నాం

నర్సాపూర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ హాస్టళ్లల్లో మెనూను పకడ్బందీగా అమలుచేస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకులాన్ని కలెక్టర్ పరిశీలించి, రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు, వంట గది, స్టోర్‌రూమ్, భోజనం తయారీ విధానాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూలు ప్రకారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. హాస్టల్లో నిద్ర చేయడంతో మార్పులు తథ్యమన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న మహిళ

రామాయంపేట, ఫిబ్రవరి 7: ప్రైవేటు ఫైనాన్స్ వారి వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాట్రియాలలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. కమ్మరి శామల కొన్ని రోజుల క్రితం ప్రైవేటు ఫైనాన్స్‌లో తన వద్దనున్న బంగారం తాకట్టు పెట్టి రూ.8లక్షలు అప్పుగా తీసుకున్నది. ప్రతి నెలా సజావుగా కిస్తీలు చెల్లిస్తున్నది. కొద్దిరోజులుగా వాయిదాలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ వారు ఆమె బంగారాన్ని వేలం వేస్తామన్నారు. దీంతో మనస్తాపం చెం ది ఇంట్లో పురుగు మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే రామాయంపేటలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్సలు చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కమ్మరి శామల గ్రామంలోని ఐకేపీలో సీఏగా విధులు నిర్వహిస్తున్నది. తాకట్టు పెటిన బంగారం వేలం వేస్తామని ఫోన్‌లో మహిళను ఫైనాన్స్ వారు బెదిరించడంతో కలతచెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు కుటుంబీకులు తెలిపారు. రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

శివ్వంపేట, ఫిబ్రవరి 7: టిక్యదేవమ్మగూడలో రోడ్డుప్రమాదంలో మృతి చెందిన నెనావత్ ఆంజనేయులు కుటుంబానికి రూ.10వేలు, రత్నాపూర్‌లో కాలు విరిగిన కమ్మరి నాగరాజుకు రూ.5వేలు, చేయి విరిగిన కండెగారి కృష్ణకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బొగ్గుల యాదగిరి, చెర్విరాల అశోక్, నాయిని వేమారెడ్డి, ఎస్టీసెల్ మండలాధ్యక్షులు రవినాయక్, రాజేందర్‌నాయక్ ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

తూప్రాన్, ఫిబ్రవరి 7: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని సూరారం నుంచి రామాయంపేటకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా టీజీ 08 టీ 2420 వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం వాహనాన్ని, రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులకు సాగునీరు అందించాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఇబ్రహీంపూర్‌లో కాలువను రైతులతో కలిసి పరిశీలిస్తున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చేగుంట, ఫిబ్రవరి 7: రైతులకు కాలువ ద్వారా సాగు నీరు అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం ఇబ్రహీంపూర్ బోనాల సమీపంలోని చిన్న చెరువు కింద సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన బోరు బావులను శుక్రవారం పరిశీలించారు. పలు గ్రామాల రైతులు బక్కి వెంకటయ్య ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు కెనాల్ ద్వారా సాగునీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ దళిత సంఘం జిల్లా నాయకులు ఎగ్గడి శేఖర్, డెరెక్టర్ లచ్చిరెడ్డి, చాతిరి స్వామి, మాజీ సర్పంచ్ అబ్రమైన మల్లయ్య, నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు వెంకటరమణ, భూషణం తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మండలంలోని జూకల్‌కు చెందిన మల్లేశానికి రూ.21,500, మూసాపేటకు చెందిన సార అశోక్‌కు రూ.12వేల చెక్కులు పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ , నాయకులు సురేశ్‌గౌడ్, రమేశ్, మాణిక్‌రెడ్డి, సుభాశ్, వెంకట్‌రెడ్డి, నర్సింహులు, దేవయ్య, కొమరయ్య, తదితరులున్నారు.

బస్టాండ్‌లో వాహనాలు పార్కింగ్ చేయవద్దు

రామాయంపేట బస్టాండులో పార్కింగ్ చేసిన కార్లు, బైకులు

రామాయంపేట, ఫిబ్రవరి 7: రామాయంపేట బస్టాండులో ఆర్టీసీ బస్సులు లోనికి రాకుండా ప్రైవేటు వాహనాలతో ఇబ్బందులు కల్గిస్తున్నారని, పార్కింగ్ చేయవద్దని ఎస్సై బాలరాజు తెలిపారు. కొంతమంది వాహనదారులు బస్సులకు అడ్డంగా కార్లు, బైకులు నిలపడంతో బస్సు డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నిసార్లు చెప్పినా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, ఆర్టీసీ బస్టాండులో పార్కింగ్ చేయవద్దని 30, 31 పోలీస్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డంపుయార్డు నిర్ణయం వెనక్కితీసుకోవాలి

పబ్బమహేశ్‌గుప్తా

శివ్వంపేట, ఫిబ్రవరి 7: గుమ్మడిదల మండలం ప్యారనగర్ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్ యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 152 ఎకరాల్లో పచ్చని అడవులు, పంటపొలాల మధ్య ఈ యార్డు నిర్మిస్తున్నారన్నారు. దీంతో శివ్వంపేట మండలంపైనా కాలుష్య ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం డంపు యార్డు నిర్ణయాన్ని విరమించుకునేవరకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తామంతా పోరాడుతామన్నారు.

మధుసూదన్‌రావు గెలుపునకు కృషి చేయాలి

వెల్దుర్తి, ఫిబ్రవరి 7: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ మద్దతుతో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడిన సంకినేని మధుసూదన్‌రావుకు ఓటేసి గెలిపించాలని ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం శుక్రవారం ప్రకటనలో కోరారు. ఎస్‌జీటీయూపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మధుసూదన్‌రావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారని పేర్కొన్నారు. ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

చేగుంట, ఫిబ్రవరి 7: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తపస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య పేర్కొన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం కలిశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానాని, అన్ని పాఠశాలలకు ఒకే విధమైన పని వేళలు ఉండాలని, పెండింగ్ డీఏ జీపీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. తపస్ రాష్ట్ర కార్యదర్శి నవత్ సురేశ్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, నియోజక వర్గ కో కన్వీనర్ గోవింద్, జానకీరామ్‌గౌడ్, రాకేశ్, వెంకటేశ్, కృష్ణమూర్తి తదితరులున్నారు.

భార్యను కత్తితో పొడిచి పారిపోయిన వ్యక్తి అరెస్టు

పోలీసుల అదుపులో నిందితుడు వెంకయ్య

రేగోడ్, ఫిబ్రవరి 7: భార్యను కత్తితో పొడిచి పారిపోయిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై పోచయ్య శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రేగోడ్‌కు చెందిన ద్యారంగుల వెంకయ్య, నాగమణి భార్యాభర్తలు. కొన్నేళ్లుగా ఇద్దరు తరచూ గొడవపడుతున్నారు. ఈ నెల 3న తల్లిగారి ఇంటివద్ద భార్య నాగమణితో గొడవపడి ఆమెపై, అడ్డువచ్చిన ఆమె తమ్ముడు గురువయ్యపై కత్తితో దాడి చేసి పారిపోయాడు. వెంకయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. బాధితులు సంగారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రంలో ఎంఈవో తనిఖీ

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

అల్లాదుర్గం, ఫిబ్రవరి 7: ఎమ్మెల్సీ ఎన్నికలకు అల్లాదుర్గంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంఈవో ధనుంజయ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు రాజేశ్వర్ రావు, తదితరులున్నారు.